

కథ 2007

11

# పూర్ణమూ నిరంతరమూ

కె.ఎ. మునిసురేష్ పిళ్లై

"ఇది నేను పూర్తి స్పృహలో ఉండి, మానసికంగానూ, శారీరకంగానూ పూర్తి ఆరోగ్యంగా ఉన్న స్థితిలో రాస్తున్న వీలునామా. నా తదనంతరం ఈ వీలునామా విషయాలను యథాతథంగా అమలు చేస్తారని ఆశిస్తున్నాను. అమలు చేయకున్నా నేను చేయగలిగింది ఏమీలేదు, అప్పటికి నేనే ఉండను కాబట్టి. నా ఆస్తుల విషయం ఇందులో ప్రస్తావించడం లేదు.

"ఆస్తులంటే అందులో ఏ ఒక్కటీ నా స్వార్జిత మని చెప్పలేను.... ఉద్యోగంలో మా దొర ఇచ్చే జీతం రాళ్లతో... మిత్రులు, నేను బాగుండాలని కోరుకునే నా హితైషులు కానుకలుగా ఇచ్చే బిచ్చం సొమ్ముతో... నా వృత్తి నన్ను అనుమతించిన మేరకు ఎవడికైనా ఎలాంటి మేలు చేకూర్చడానికైనా నేను కక్కుర్తిపడి వారు కక్కిన కూటిని కతికి... సమకూర్చుకున్నవి. కాబట్టి ఈ వీలు నామాలో నేను ఆస్తుల గురించి ఎలాంటి ప్రస్తావనా చేయడం లేదు. ఆత్మవాదులు ఒప్పుకోకపోవచ్చుగానీ.. నాకు తెలిసి నాది అనుకోదగినది నా దేహం ఒక్కటే. దాని విషయం మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తాను."

"వెధవది నీ దేహం ఎవడిక్కావాల్రా. తగలెడితే బూడిద. పాతితే మట్టి. దానికోసం ఈ వెధవ విల్లేమిటి?" చదవడం ఆపి గట్టిగా నవ్వాడు సేతురాముడు.

నిజానికి నేను నా విల్లును చక్కటి పొందికైన ఇంగ్లీషులో రాశాను. ఇప్పుడు దాన్ని చదువుతున్న సేతు రాముడికి ఇంగ్లీషు బాగా తెలుసు. కానీ వెధవకు కొంచెం తెలుగు పిచ్చి. బుర్ర పెరగని మనిషి. అందుకే ఇంగ్లీషు వాక్యాల్ని మనసులో ఒక్క ఉదుటున చూసి, తెలుగులో బయటకు పలుకుతూ చదువుతున్నాడు. మొదటి పేరా చదవడంతోటే వాడికి నా వీలునామా మీద సీరియస్‌నెస్ పోయినట్టుంది. ఇక అక్కడి నుంచి, అందులోని వాక్యాలకు జతగా... తన రన్నింగ్ కామెం టరీ మొదలెట్టాడు.

"నేను మరణించాక నా దేహాన్ని కాల్చడానికిగానీ, పూడ్చడానికిగానీ వీల్లేదు- బాగుందిరా... ఇంటా బయటా, పగలూ రాత్రీ కాకుండా చావాలని కోరుకున్న హిరణ్యకశిపుడిలాగా... నీ కోరిక! వెధవది చచ్చాక నీ దేహాన్ని ఏం చేసుకోవాల్రా... కాల్చా, పూడ్చాకుండా! గ్లాసుకేసులో భద్రంచేసి రోజూ పూజలు చేయాలా? వెధవా..."

వీడి నుంచి ఇలా పదపదానికీ సందర్భసహిత వ్యాఖ్యానం వస్తూనే ఉంటుందని నాకు తెలుసు. అయినా చేసిన పనిని సమీక్షించుకోవడానికి ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నది వీడొక్కడే. మళ్లీ చదవసాగాడు.

"నేను ఇప్పటికే ఉస్మానియా వైద్యకళాశాల వారితో మాట్లాడాను. వారికి అంగీకారపత్రం కూడా రాసి ఇచ్చాను. వారి ఫోను నెంబరు, రెఫరెన్సు కోసం వారికి చెప్పవలసిన నెంబరు గల లేఖను ఇందువెంట జతపరి చాను. నేను చచ్చిన వెంటనే వారికి ఫోన్ చేస్తే వారు స్వయంగా వాహనంలో వచ్చి నా దేహాన్ని తీసుకెళతారు. అందులో ఇతరుల కోసం ఉపయోగపడగలిగిన అవ యవాలన్నిటినీ తీసుసుకున్న తరువాత... మిగిలిన శరీరాన్ని విద్యార్థుల ప్రయోగాల కోసం వాడుకుంటారు. ఈ నిర్ణయాన్ని దయతో ఎవ్వరూ వ్యతిరేకించవద్దని మనవి. ఎవ్వరూ అతిక్రమించరని విశ్వాసం."

వాడి మొహంలో ఇప్పుడు ఎగతాళి లేదు. నవ్వు లేదు. ఓసారి తలెత్తి నావైపు సీరియస్‌గా చూసి మళ్లీ

అందులో పడిపోయాడు. ఈసారి బయటకు చదవ ట్లేదు. మనసులో చదువుకుంటున్నాడు. కానీ, అందు లో ఉన్న సారాంశం ఇది...

'నేను చస్తే మెడికల్ కాలేజీ వారికి మినహా ఎవ్వరికీ కబురు చేయవద్దు. దేశాలు పట్టిపోయిన పిల్లల క్కూడా. 'చివరిచూపు' అనే కాన్సెప్టు మీద నాకు నమ్మకం లేదు. చచ్చిపోయాక ప్రాణంలేని దేహాన్ని చివరిగా చూడటమేమిటి... ట్రాష్! అదివరలో వారు నన్ను ఎప్ప డెప్పుడు కలిశారో ఓసారి గుర్తు చేసుకుంటారు, సజీవ మైన అదే చివరిచూపు. అదేదో వేడుకలాగా.. పూల మాలలూ, మేళాలూ ఈ గోలంతా నాకు కిట్టవు. ప్రాణం మాయమైతే చాలు ఆ శవం అప్పుడే దేవుడైపోయి నట్లుగా అంతా వచ్చి కాళ్లు మొక్కడాలూ... ఇలాంటివి నాకు అసహ్యం. అందుకే నా మట్టుకు అలాంటివేం లేకుండా చూడగలరు. ప్లీజ్,' ఇలాంటివే మరికొన్ని వాక్యాలేవో రాసి ముగించాను.

చదవగానే, అసలే కాస్త ఎర్రగా ఉంటాడు, వాడి మొహం జేవురించింది. దాన్ని పరపరా చిన్న ముక్కలు గా చింపి విసిరికొట్టాడు.

వాడికిచ్చింది జిరాక్స్ కాపీ.

"ఆవేశం ఆరోగ్య సూచిక కాదు," అన్నాన్నేను.

"ఇలాంటి అసందర్భ పిచ్చి ప్రేలాపనలు ఆపు తావా?" అన్నాడు.

ఈలోగా అన్నపూర్ణ వచ్చింది, మూడు కాఫీ కప్పు లతో.

"ఈ పైత్యాన్నంతా నువ్వు కూడా చదివావా?"

"నన్ను గూడా ఇలాంటిదే రాయమంటండాడు నా," అంది. మా కప్పులు టీపాయ్ పై పెట్టి, తను గట్టు మీద కూచుంటూ.

"ఒక్క రాత్రిలో ఇంత పిచ్చెక్కడం కూడా సాధ్య మేనన్న మాట," అన్నాడు వాడు.

ఈ పిచ్చిని (జనాభిప్రాయాన్ని మనమెందుకు కాదనడం) ఒక్క రాత్రిలోనే రాశాను గానీ, ఆలోచన ఒక్క రాత్రిది కాదు.

*

"కిరణ్మయి వాళ్ల అమ్మ చనిపోయింది. నేను శ్రీకాళహస్తి వెళుతున్నా," నా కొడుకు ఫోన్ చేశాడు మొన్న రాత్రి.

"హాస్పిటల్ దగ్గరకెళ్లావుగా... చూడనివ్వలేదా?" అడిగాను.

"చూడ్డం ఏముందిలే! ఇప్పుడే అంబులెన్స్ బయ ల్దేరింది. నేను ఏదో బస్సు పట్టుకుని వెళ్తా."

"చివరి చూపులు కూడా అయ్యాయి కదరా. వెళ్డం అవసరమా...?"

"వెళితే ఏమిటి నష్టం." ఇంకేం మాట్లాడగలను.

"ఓ జత బట్టలు..."

నా మాట తుంచేస్తూ "ఇదేమన్నా పెళ్లా. ఎల్లుం డొచ్చేస్తా," అని కట్ చేసేశాడు.

నాకు పాతికేళ్ల వయసులో నలభై అయిదేళ్ల ఫ్రెండ్సుండేవాళ్లు. చాలామంది చాలా చనువుగా, పెద్ద రికం ప్రస్తావన లేకుండా స్నేహంగా మెలగగలిగే రీతిలో. నాకు నలభై అయిదు వచ్చేసరికి పాతికేళ్ల కొడుకు తయారయ్యాడు. ఇక నాకు పెద్దరికం కన్నా స్నేహమే మిగిలింది. వాడితో సంభాషణ ఎప్పుడూ ఇలాగే ఉంటుంది. అర్జెంటుగా ఎవరో తెగ్గొట్టేస్తున్నట్టు.

కిరణ్మయి అమ్మ చనిపోవడం మా కుటుంబా నికి కూడా బాధ కలిగించే సంగతి. ఆమె నాక్కూడా తెల్సు. చాలా మంచిది. ముగ్గురూ అమ్మాయిలే. మా వాడిని బిడ్డలా చూసుకునేది. సొంత అక్కచెల్లెళ్లు లేని ఈ ఏకాకి ఇంట్రావర్ట్ వెధవకి వాళ్లతోటి గట్టి బంధమే కుదిరింది. ఉన్న కొద్దిలో... వాళ్లు గొప్ప! ఇదంతా అన వసర ప్రస్తావనగానీ, వాడు వెళ్లిపోయాక నా ఆలో చనలు చావుమీదికి, వాడు అక్కడకు వెళ్లాక జరగ బోయే తతంగం మీదికి మళ్లాయి. స్మశాన వైరాగ్య చింతనలాగా....

వాడు వెళ్తాడు. చెప్పానుగా ఇంట్రావర్ట్ వెధవని, వాళ్లదేమో భూమంతా అల్లుకున్న బంధువర్గం. వెళ్లి అక్కడ ఓ మూల నిల్చుంటాడు. ఓవైపు పూలమాలలూ, డప్పు మేళాలూ తదితర సమస్త హంగామా ఉంటుంది. అంతా ముగిశాక తిరిగి రైలెక్కి వచ్చేస్తాడు. అంతకు మించి భోరున ఏడ్చే, కనీసం ఏడుస్తున్న వారిని పరా మర్శించే పాటి కలివిడి కూడా వీడికి ఉందనుకోను.

అసలు ఎందుకిదంతా. చావు అనేది ఎట్టి పరి స్థితుల్లోనూ మనం తప్పించుకోలేని, ఎట్టి పరిస్థితు ల్లోనూ మనకు ఎదురై తీరే సంగతి. సందర్భాన్ని బట్టి ఒక్కొక్కరికీ ఒకింత ముందూ వెనకా అంతే. దాన్ని గురించి ఇంత హడావిడి ఎందుకు? ఎవరు చచ్చినా బంధుగణమంతా ఎగబడి ఊళ్ల మీద ఊళ్లు దాటి వచ్చి చూసి వెళ్లడం... శవాన్ని ఊరేగించుకుంటూ ఆ సంగతి పురప్రజలు గుర్తించరేమోనని డప్పులు వాయించు కుంటూ... టపాసులు పేల్చుకుంటూ... ఇదంతా అవసరమా?

సమాజం మారుతోంది. ప్రపంచమంతా గుప్పిట్లో ఇమిడిపోతోంది. టెక్నాలజీ మనుషుల్లో మార్పులు తెచ్చేస్తోంది. అయినా మనుషుల ఆలోచనాసరళి మారడంలేదు. మహా ముదిరితే... యూఎస్‌లో ఉన్న కొడుకు ఇండియాలో ఉన్న తండ్రి చనిపోతే, ఆయన్ని

ఎలక్ట్రిక్ క్రిమేషన్ బెడ్ మీద పడుకోబెట్టిన తర్వాత యూఎస్‌లో తన ఆఫీసు పని చేసుకుంటూ క్రిమేషన్ తాలూకూ వెబ్‌సైట్ ఓపెన్ చేసుకుని ఓ 'మౌస్ క్లిక్'తో తగలెట్టేసే టెక్నిక్స్ కనుక్కుంటారేమోగానీ, అసలు ఈ తగలెట్టడం అవసరమా... అనే ఆలోచన మాత్రం చేయ రనుకుంటా....! మరోవైపు మన మెడికల్ కాలేజీలు ప్రయోగాలకోసం శవాలు దొరక్క సతమతమై పోతుం టాయి. కొంటుంటాయి. మనం మాత్రం ఉన్న శవాలకు దండలేసి, పార్టీ జెండాలు కప్పి దేవుళ్లను చేస్తుంటాం. కొందరు గొప్పోళ్లు, నాయకుల విషయంలో పరిస్థితి ఇంకా ఘోరం.

వాళ్లని తగలెట్టాలంటే గంధం కొయ్యలూ, నెయ్యి డబ్బాలూ కావాలి. కప్పెట్టాలంటే సమాధి, దాని చుట్టూ తోటలు పెంచాలంటే ఎకరాల కొద్దీ స్థలం కావాలి. అసలే రియలెస్టేటు పరిస్థితి ఎలా ఉంది ప్పుడు. హైదరాబాదులాంటి ఊళ్లలో ఆరడుగుల స్థలం కావాలంటే మూడు లక్షలవుతుంది. అయిడియా, సర్కారు స్మశానంలో స్థలాన్ని తేరగా పంచేయకుండా... రియల్ ఎస్టేట్ వ్యాపారులకిస్తే సరి. ఇక ఎవరూ చచ్చినా వాటి జోలికెళ్లరు. ఎంచక్కా కరెంటు చితి మంటల్లో, మెడికల్ కాలేజీల్లో చూసుకుంటారు. అవును మెడికల్ కాలేజీలకు ఇచ్చే అలవాటు రావాలి. రావాలంటే ఎవరో ఒకరు మొదలెట్టాలి.

- అలా తయారైంది ఈ విల్లు.

*

రెండోరోజుకు బాబు వచ్చేశాడు. ఓకాపీ ఇచ్చాను. సగం చదివి-

"అద్భుతంగా ఉంది నాన్నా. అసలు నువ్వొక్క డివీ కాదు. మనం మన పరిచయస్తులందరినీ ఇలాంటి అగ్రిమెంట్లకు ఒప్పించామంటే చాలా బాగుంటుంది. దీన్నొక వుద్యమంలా చేపట్టాలి. చిరంజీవి కళ్లూ, నెత్తురూ పోగేసినట్టు..." ఆవేశంగా అన్నాడు. నా కొడుకు నుంచి అంతకంటె భిన్నమైన స్పందన వస్తుందనే భయం నాకు లేదు.

సాంతం చదువు అన్నట్టుగా సంజ్ఞ చేశాను.

అన్నపూర్ణ అక్కడే కూర్చుని సినిమా దర్శకుడి మీద గౌరవంతో... కామెడీకి నవ్వకుండా, యాక్షన్ సన్నివేశాల్లో దాన్ని ఫీలవకుండా రాయిలాగా చూసే ప్రేక్షకుడి మాదిరిగా మా ఇద్దర్నీ చూస్తూ కూర్చుంది.

"ఇదేమిటి. చిత్రంగా ఉంది," అన్నాడు చివరి పేరా ముగించి.

"అదే ట్విస్టు," అన్నాన్నేను.

ఒక్కటంటే ఒకే ఒక్క క్షణం తలవంచుకుని స్తబ్దుగా, నిశ్శబ్దంగా ఉండిపోయాడు.

"ఎవరినీ పిలవొద్దనీ, ఎవరూ రావొద్దనీ ఆదేశించ డానికి నీకేం హక్కు ఉందసలు," అక్షరాల్లో రాస్తే ఇలా కటువుగా ఉందిగానీ, మా వాడు ఆ ప్రశ్నను చాలా సుతిమెత్తగా తగిన విరుపులు, 'పాజ్'లతో వినయంగా అడిగాడు. ఒక్క వాక్యంలో ముగిసిపోయింది గానీ, అందులో చాలా అనుబంధ ప్రశ్నలున్నాయి. అవును, 'ఇతరుల' (అంటే మన కొడుకు కావచ్చు. మిత్రులు బంధువులు ఎవరైనా కావొచ్చు) స్వేచ్ఛని, ఇష్టాలని నియంత్రించే, కాదనే అధికారం మనకు ఎందుకుం టుంది? ఈ కోణం నాకు ఇదివరకు స్ఫురించలేదు.

ఇప్పుడు ఏం చెప్పాలో తటాల్మని తోచలేదు.

మాటల కోసం దేవులాడాల్సి వచ్చింది.

"అంత సూటిగా చెప్పలేను. ఎగ్జాంపుల్స్‌తో అయితే ఓకే."

"ఏదోట్లే! అసలు ఎందుకలా రాశావో చెప్పు?"

"కిరణ్మయి వాళ్ల అమ్మ చనిపోతే నీవెళ్లి ఏం చేశావ్?" ఎందుకా ట్విస్టు ప్రశ్న వేశానో వాడికి అర్థం కాలేదుగానీ, సావధానంగా చెప్పాడు.

"చేయడానికేముంటుంది? సరిగ్గా శవాన్ని దించే సమయానికి నేను అక్కడికెళ్లా. బంధువులంతా అప్ప టికే వచ్చేసినట్లున్నారు. బాధలూ, ఏడుపులూ, దుఃఖాలూ మొదల య్యాయి. పొద్దుగుంకే ముందు శవాన్ని ఏటికి తీస్కెళ్లారు. నేను తిరుపతి వచ్చి బస్సెక్కి వచ్చేశా..."

"నువ్వు ఏడ్చావా...?"

"చావు ఒక విముక్తి. దానికి ఏడవడం ఎందుకు?"

"ఎవరినైనా ఊరడించావా?"

"ఏడుపును మించిన ఊరడింపు ఉంటుందా? మధ్యలో నేనెందుకు?"

"పూలమాలలూ, కాళ్లు మొక్కడాలూ..."

"నాన్నా ట్రాష్ మాట్లాడకు. శవానికి మొక్కితే, దండలేస్తే గౌరవించడం కాదు. ఆ మనిషి వ్యక్తిత్వం, మంచితనం గుర్తుంచుకుని ఆచరిస్తే అదే గౌరవిం చడం," ఈసారి వినయం లేదు, ఘాటుగానే అన్నాడు.

"మరైతే అందుకోసం నువ్వు హైదరాబాదు నుండి ఎకాయెకిన శ్రీకాళహస్తి వెళ్లాల్సిన అవసర మేంటి?"

వాడు బిత్తరపోయాడు. ఈ చర్చ చివర్లో నేను ఇలాంటి (పిచ్చి) ప్రశ్నను సంధిస్తానని వాడు ఊహించి ఉండకపోవచ్చు.

బుర్రంతా దేవులాడినా సరే, ఎగ్జాంపుల్స్‌తో అయినా సరే... వాడు దీనికి సమాధానం చెప్పగలడని నేను అనుకోను. నేను వాడి అబ్బని. వాడు చాలాసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు.

''రిలేషన్స్ లాజికల్‌గా ఉండవు నాన్నా,'' అన్నాడు. చాలా కష్టపడి కూడగట్టుకున్నట్టు.

''పలాయనవాదంను ఆశ్రయించేప్పుడు వచ్చే మొదటి సమాధానం ఇది,'' అన్నాన్నేను.

వాడు చివాల్న లేచి, విసురుగా తన గదిలోకి వెళ్లి పోయాడు. ఓటమి, చేతగానితనం బయటపడినప్పుడు మాత్రమే ఏ మనిషికైనా వచ్చేది కోపం. నా పుత్రరత్నానికీ అలాగే కోపం వచ్చింది.

*

...అని నేను అనుకున్నాను.

ఆ రాత్రి భోజనాలయ్యాక నేను పడగ్గదిలో కంప్యూటర్ ముందు కూర్చుని ఎమ్మెస్ వర్డ్ కాగిత మ్మీద, కీబోర్డుతో ఏదో రాసుకుంటున్నాను. అన్నపూర్ణ కార్టూన్ నెట్‌వర్క్‌లో తనకు ఇష్టమైన టామ్ అండ్ జెర్రీ చూస్తోంది.

బాబు వచ్చి నా బెడ్‌మీద కూర్చున్నాడు, నాకు వెనగ్గా.

''ఈ ప్రపంచంలో లాజిక్ లేకుండా ఏదీ ఉండదు నాన్నా, రిలేషన్స్ కూడా!'' ఉపోద్ఘాతం లేకుండా ఉదయం సంభాషణ అందుకున్నాడు.

నేను వెనక్కు కూడా తిరగలేదు. 'సరే చెప్పు' అన్నట్లుగా కీల టకటకలు ఆపాను. ఏం చెబుతాడు వాడు? అందమే జీవితం అనుకునే వయసులో ఉన్నాడు. ఏం చెప్పడానికైనా ఏం జీవితానుభవం ఉంది వాడికి. అయినా మొదలెట్టాడు...

''ఎవరైనా చనిపోతే మనం వెళ్లడం పోయిన వారి కోసం కాదు నాన్నా మిగిలిపోయిన వారికోసం,'' ముందు ఈ వాక్యం అర్థంచేసుకో అన్నట్టుగా కొంత ఆగాడు. నేను వింటున్నాను. అర్థం కూడా చేసుకుంటు న్నాను.

''కిరణ్మయి అమ్మ చనిపోయింది. ఆమె కోసం మనం వెళ్తామా? కిరణ్మయి కోసం వెళ్తాం...''

'ఎందుకు?' అనబోయానుగానీ, ధారకు అడ్డు అవుతుందని ఆగిపోయాను.

''కిరణ్మయి అమ్మ సంగతి ఎందుకు? రేపు నువ్వు చనిపోతే ఎవ్వరూ రావొద్దని మహా రాసేశావ్. కానీ నీ శవాన్ని మెడికల్ కాలేజీ వ్యాన్ ఎక్కించే వరకూ దాని ముందు కూర్చుని ఉంటే నేను ఏడవకపోవచ్చు. కానీ లోపల ఏదో ఫీలింగ్ ఉంటుంది నాన్నా. ఏదో కోల్పోయిన ఫీలింగ్. మన నుంచి ఏదో, ఎవరో తీసుకెళ్లి పోతున్న ఫీలింగ్. ఆ సమయంలో ఎదురుగా నాకోసం వచ్చిన వాళ్లు కనిపించారనుకో... వాళ్లు ఊరడించక పోవచ్చు. కానీ, 'ఒకరిని కోల్పోయాను, కానీ నాకింకా ఇందరున్నారు,' అనే భరోసా అందుతుంది హృద యానికి. నేను వెళ్లిందీ అందుకే. వాళ్ల అమ్మ చూపించిన ప్రేమలో నేను వెయ్యో వంతు చూపించగలనా వాళ్లకి? వందోవంతు ఆదరణ ఇవ్వగలనా? 'ఏం బంధం మిగిలింది ఇంకా నాకిక్కడ?' అని కిరణ్మయి కళ్లమ్మట నీళ్లు పెట్టుకుంటే... 'బంధాలకు మేంలేమా,' అని నేను కాదు, నాలాంటి వందమంది అక్కడ కనిపిస్తే... ఆ మనసుకు బంధాలు ఇంకా ఉన్నాయని అనిపిస్తుంది.

''నువ్వు చదువుకున్నావ్‌గా నాన్నా... వేదాల్ని. 'పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే' అని! దాని అర్థం ఏమిటో ఎవరికైనా చెబితే మన మొహాన్నే నవ్వి పోరూ...! మొత్తంలోంచి మొత్తం తీసేస్తే- మొత్తం మిగిలి ఉంటుంది.

''అనేగా దాని అర్థం. ఎక్కడుంటుంది నాన్నా అలా? ప్రాక్టికల్‌గా అసలది ఊహించగలమా? అయితే అది సాధ్యమే. వేదం చెప్పే దేవుడిలో అది ఉంటుందో లేదో నాకు తెలీదు కానీ అది మానవ అనుబంధాల్లో ఉంటుంది నాన్నా. పూర్ణమైన ఒక అనుబంధం ఇక తెగి పోయింది... అయితే అనుబంధాలు ఇంకా పూర్ణంగానే ఉన్నాయి. దాన్ని అనుభూతింపజేయడానికే నాన్నా...''

స్వరం పట్టేసినట్టు ఆపేశాడు.

నేను అనుకున్నది కరెక్టే.... 'ఏదైనా చెప్పడానికి ఏం జీవితానుభవం ఉంది వాడికి?'

నేను అనుకోనిది ఒకటి ఉంది... 'ఏదైనా చెప్ప డానికి కావాల్సింది జీవితానుభవం కాదు, మనసు.'

వాడు కొనసాగించాడు.

''ఇది నువ్వు ఆలోచించే తెలివితేటలుగల మెదడుకు సంబంధించినది కాదు నాన్నా. మనసుకు అందే కమ్యూనికేషన్.''

ఈసారి ఆపేయడంలో, ఇక అంతా అయిపో యింది అనే ముక్తాయింపు ఉంది.

నేను మరుగుజ్జును అయిపోయిన ఫీలింగ్ వస్తోంది.

నేను వాడికేసి తిరిగాను. వాడి కళ్లలోకి చూశాను.

ఊహ తెలిసినప్పటినుంచి వాడికి నా కళ్లలోని చూపు బాగా పరిచయం. లేచి నా దగ్గరకు వచ్చి మెడ చుట్టూ చేతులేసి బిగించి పట్టుకుంటూ, బుగ్గమీద గట్టి ముద్దు పెట్టాడు.

వాడి బుగ్గ మీది తడి, నా బుగ్గమీది తడితో కలిసి పోయింది. రెండూ వెచ్చగానే ఉన్నాయి.

అసలిప్పుడు కన్నీళ్లెందుకు వచ్చాయి?

...ఈ ప్రపంచంలో లాజిక్ లేని సంగతులు కూడా కొన్ని ఉంటాయి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 6 మే 2007*